www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

బుధవారం, 05-08-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :95 Issue : 95 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## పేదల బియ్యంపై దోపిడి..!



5




## పాట... ఫైటు...

8

## సీజేపీ దూకుడు

- నీట్ ఉద్యమం తర్వాత దేశవ్యాప్తంగా విజనింగ్ టూర్
- యువతతో నేరుగా మమేకం కావాలని పార్టీ నిర్ణయం
- మహారాష్ట్రలో రెండు రోజుల కీలక సమావేశం
- జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న వాలంటీర్లతో చర్చలు




6



## రాజీనామా చేస్తే వెంటనే ఆమోదం

- కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి.. డీకే శివకుమార్ హెచ్చరిక
- రాజీనామా చేస్తే నిమిషాల్లోనే ఆమోదిస్తానన్న ముఖ్యమంత్రి
- అసంతృప్త ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలుస్తానని స్పష్టీకరణ

6




## ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ

- నాణ్యతపై ఆందోళన అవసరం లేదు.. కఠిన తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడి
- ఈ20 పెట్రోల్ నాణ్యతపై కేంద్రం వివరణ
- దేశవ్యాప్తంగా 87 వేలకుపైగా బంకుల్లో నిరంతర పరీక్షలు

6



## పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

- పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

3



## ప్రతి గింజా ప్రజల ఆస్తే

- డిఫాల్ట్ మిల్లర్ల నుంచి ప్రతి పైసా, ప్రతి గింజా వసూలు
- నిజాయతీ మిల్లర్లకు పూర్తి రక్షణ
- దశాబ్ద కాలపు సీఎంఆర్‌పై ఆడిట్‌కు మంత్రి ఉత్తమ్ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్ :**
ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తరువాత తొలిసారిగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై గత పది నుంచి 12 సంవత్సరాల కార్యకలాపాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం సేకరణ నుంచి బియ్యం అప్పగింత వరకు జరిగిన ప్రతి లావాదేవీ, మిల్లర్ల వారీగా డిఫాల్ట్‌లు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ దర్యాప్తులు, న్యాయపరమైన చర్యలు, అమలు వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించి భవిష్యత్తులో ఎలాంటి లోపాలకు తావు

మిగతా 3వ పేజీలో..



# పాలిటిక్స్‌లో షార్ట్ ఫార్ములా

## షార్ట్ వీడియోలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు

- ఇన్‌స్టా చుట్టూ రాజకీయ ప్రచారం..
- జెన్ జీని టార్గెట్ చేస్తున్న నేతలు
- ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌పై పార్టీల ప్రత్యేక దృష్టి
- జెన్ జీ ఓటర్ల అభిరుచులకు అనుగుణంగా మారుతున్న రాజకీయ వ్యూహాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**
దేశంలో ఎన్నికల ప్రచార శైలి వేగంగా మారుతోంది. ఒకప్పుడు వార్తాపత్రికల ప్రకటనలు, బహిరంగ సభలు, ప్రెస్‌మీట్లు ప్రధాన ప్రచార సాధనాలుగా ఉండగా.. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ రాజకీయ ప్రచారంలో కీలక వేదికలుగా మారుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సీనియర్ నాయకుల నుంచి యువ నేతల వరకు అందరూ డిజిటల్ వేదికల ద్వారా యువ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

**జెన్ జీ ఓటర్లే ప్రధాన లక్ష్యం**
18 నుంచి 27 ఏళ్ల మధ్య వయస్సు గల జెన్ జీ ఓటర్ల ఆలోచనా విధానం రాజకీయ పార్టీల ప్రచార వ్యూహాలను ప్రభావితం చేస్తోంది. ఈ తరం ఫేస్‌బుక్ కంటే ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికలపై ఎక్కువ సమయం

మిగతా 3వ పేజీలో..

## కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




3

## అగమ్యగోచరంగా ప్రభుత్వ హాస్పిటల్స్

- ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు
- కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

3





## మసాలాల్లో మహా కల్తీ

- 25 టన్నుల నకిలీ మసాలా స్వాధీనం.. మరో 89 టన్నుల నిల్వలు గుర్తింపు
- కాటేదాన్‌లో హెచ్-ఫాస్ట్ భారీ దాడులు
- ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులతో మసాలాల తయారీ
- ప్రముఖ బ్రాండ్ల పేర్లతో మార్కెట్లో విక్రయాలు
- 13 వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించిన అధికారులు
- కల్తీ ఆహారంతో తీవ్ర ఆరోగ్య సమస్యల ప్రమాదమని హెచ్చరిక

3

## అభ్యంతరకర పోస్టులపై ఫిర్యాదు చేయడం తప్పా?

- డీసీపీ ఆనంద్‌బాబును ఎందుకు బదిలీ చేశారు
- రాహుల్‌పై విమర్శలు చేస్తే ఇలాగే వదిలేస్తారా
- సీఎం రేవంత్‌పై కిషన్ రెడ్డి విమర్శలు



3

## అభివృద్ధికి అవినీతే ప్రధాన అడ్డంకి

‘బ్రిక్స్’ దేశాల మధ్య సహకారం బలోపేతం కావాలి
భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా
ప్రారంభమైన ఏసీడబ్ల్యూజీ సమావేశం

2




## ఇక సర్కారు కార్యాలయాలకు టీఫైబర్ నెట్ సేవలు

- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్ :**
రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కేవలం టీఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. టీఫైబర్ సేవలపై తన కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. గడువులోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్నెట్ సేవలు అందించేలా

మిగతా 3వ పేజీలో..






## సమగ్ర అభివృద్ధికి విద్యే కీలకం

- వీసీల సమావేశంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, ఆగస్ట్ 4, ఆశ్వి అప్డేట్స్:**
సమగ్ర అభివృద్ధికి విద్యనే కీలకమని గవర్నర్, యూనివర్సిటీల చాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో గవర్నర్’ అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమావేశం, నషా ముక్తే యువ వికసిత్ భారత్, మై భారత్ పోర్టల్, రెడ్ క్రాస్ సొసైటీ తదితర అంశాల్లో విద్యార్థుల భాగస్వామ్యం,

మిగతా 3వ పేజీలో..

# అభివృద్ధికి అవినీతే ప్రధాన అడ్డంకి

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

సుస్థిరమైన, సమ్మిళితమైన అభివృద్ధికి అవినీతి ప్రధాన ఆటంకంగా ఉందని 'బ్రిక్స' అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్(ఏసీడబ్ల్యూజీ) సమావేశం అభిప్రాయపడింది. పరారీలో ఉన్న నేరస్తులను పట్టుకోవడానికి, అక్రమ ఆస్తుల రికవరీలో 'బ్రిక్స' దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించింది. రెండు రోజులు నిర్వహించే ఈ సమావేశాలు హైదరాబాద్‌లో మంగళవారం ప్రారంభం కాగా భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి అనే సవాలుకు ఏ దేశమూ మినహాయింపు కాదని, ఏ దేశమూ దీన్ని ఒంటరిగా ఎదుర్కోలేదని స్పష్టం చేశారు. అక్రమ ఆర్థిక మళ్లింపులను నివారించి, ప్రజా వనరులను పరిరక్షించడానికి, అంతర్జాతీయ అవినీతి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సమష్టిగా, సమన్వయంతో కూడిన, నిరంతర అంతర్జాతీయ సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. సమగ్రత, జవాబుదారీతనం, అంతర్జాతీయ సహకారం, ఆవిష్కరణల బలోపేతం అత్యంత ముఖ్యమైనవిగా మారిన ఈ సమయంలో బ్రిక్స్ ఏసీడబ్ల్యూజీ రెండో సమావేశం జరుగుతోందని రచనా షా తెలిపారు. సీమాంతర అవినీతిని ఎదుర్కోవడంపై తన ఉమ్మడి బాధ్యతను బ్రిక్స్ ఆచరణాత్మక సహకారంగా, స్పష్టమైన ఫలితాలుగా మార్చాలన్నారు. నేరాల నుంచి లబ్ధి పొందే వారికి ఏ దేశమూ ఆశ్రయంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించడం, దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, నేరస్తులు, అక్రమ నిధులు సరిహద్దులు దాటి తరలిపోవడానికి అవకాశం కల్పిస్తున్న లోపాల తొలగింపులో బలమైన సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. అవినీతి ఆరోపణలతో పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించేందుకు ఏర్పాటు చేసిన అనధికారిక సహకార బ్రిక్స్ భాండాగారం విషయంలో సాధించిన పురోగతిని స్వాగతించారు. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నిందితుల విషయంలో, వారి అప్పగింతకు మద్దతు ఇచ్చేందుకు, బ్రిక్స్ దేశాల మధ్య అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్‌పై జరుగుతున్న చర్చలను, బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ కార్యకలాపాలు ప్రారంభించటాన్ని కూడా స్వాగతించారు. సమాచార మార్పిడి కోసం రూపొందించిన ప్రామాణిక టెంప్లేట్, స్థానిక నోడల్ పాయింట్లు, నిపుణుల డైరెక్టరీతో కలిసి చట్టాన్ని అమలు చేసే సంస్థల మధ్య వేగవంతమైన, మరింత ప్రత్యక్షమైన, అత్యంత ప్రభావవంతమైన సహకారాన్ని సులభతరం చేస్తాయన్నారు. నివారణాత్మక అప్రమత్తత, సాంకేతికత ఆధారిత పరిపాలనకు పెద్ద పీట వేస్తూ అవినీతి ముప్పును ఎదుర్కొనే పరిష్కారంలో సాంకేతికతే కీలకమని కార్యదర్శి అన్నారు. డిజిటల్ గుర్తింపు, ఎలక్ట్రానిక్ సేవలందించే విధానం, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక కొనుగోలు వ్యవస్థలు వృథాను తగ్గించగలవని, అధికారుల విచక్షణాధికారాలకు కళ్లెం వేయగలవని, ప్రజా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయగలవని పేర్కొన్నారు. దేశ జాతీయ ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ అయిన గవర్నమెంట్ ఇమార్కెట్ ప్లేస్(జీఈఎం), ప్రత్యక్ష నగదు బదిలీ కార్యక్రమాలను సాంకేతికత ఆధారిత సంస్కరణలకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. పన్నుల విధింపు, ఇతర ప్రభుత్వ ప్రక్రియల్లో ముఖ రహిత, కాగిత రహిత విధానాలు, సాంకేతికతతో కూడిన నిఘా, డేటా ఆధారిత పర్యవేక్షణ, బలమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను కూడా ఆమె ప్రస్తావించారు.

**నైతిక పరిపాలనపై సమాంతర కార్యక్రమం**

విస్తరించదగిన విజిలెన్స్ పద్ధతులు, సాంకేతికత ఆధారిత పరిష్కారాలు, నివారణాత్మక పర్యవేక్షణా విధానాలపై సభ్యులు తమ అనుభవాలను పరస్పరం పంచుకోవడానికి ఒక చక్కటి అవకాశాన్ని అందిస్తుందని రచనా షా తెలిపారు. అవినీతికి పాల్పడి పరారైన నేరస్థుల అన్వేషణ, నేరస్థుల అప్పగింతకు మద్దతు ఇచ్చే అనధికారిక సహకారంపై బ్రిక్స్ రిపాజిటరీ, బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్, బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ రెండో సెషన్‌లో చర్చలు జరగనున్నాయి. 'నవకల్పనలు, సాంకేతికత ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పాలన'పై ఒక సమాంతర కార్యక్రమం, 'ఆర్థిక సాంకేతికత(ఫిన్‌టెక్), వర్చువల్ డిజిటల్ అసెట్స్ (వీడీఏలు) నుంచి ఎదురవుతున్న అభివృద్ధి చెందుతున్న ముప్పులు, అవినీతి ద్వారా వచ్చిన సొమ్మును దాచడంలో, లాండరింగ్ చేయడంలో వాటి దుర్వినియోగాన్ని అరికట్టడంపై ప్రత్యేక సెషన్ ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి. ప్రారంభోత్సవంలో బ్రిక్స్ ఏసీడబ్ల్యూజీ చైర్మన్ జె.అశోక్ కుమార్ ప్రతినిధి బృందాలకు స్వాగతం పలికారు. వారి నిరంతర భాగస్వామ్యానికి, నిర్మాణాత్మక సహకారానికి, పరస్పర సహకార స్ఫూర్తికి ధన్యవాదాలు తెలిపారు. గత కొన్ని నెలల్లో సాధించిన పురోగతి, నిరంతర చర్చల విలువ అవినీతి నిరోధక సహకారాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ దేశాల మధ్య ఉన్న ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం బలోపేతానికి ఆచరణాత్మక సాధనాలు, విధానాలను అభివృద్ధి చేయడంపై ఏసీడబ్ల్యూజీ దృష్టి సారించిందన్నారు.



# 15లోగా 13,046 పంట కుంటలు పూర్తి చేయాలి

- **గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రవ్యాప్తంగా 13,046 వ్యవసాయ కుంటల నిర్మాణాన్ని ఈనెల 15లోగా పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు(డీఆర్‌డీఓలు), జిల్లా పంచాయతీ అధికారులు(డీపీవోలు), జడ్పీ సీఈఓలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. వీబీజీ రామ్‌జీ, తెలంగాణ జలసిరి, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీఎస్‌పీ) అమలుపై సమీక్షిస్తూ ప్రతి గ్రామ పంచాయతీలో వ్యవసాయ కుంటల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభాన్ని వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో కనీసం 50 ఎకో ఫార్మ్ పాండ్లను సెర్ప్/ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్యశాఖల సమన్వయంతో చేపట్టాలని సూచించారు. తెలంగాణ జలసిరి కింద వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, బహిరంగ బావుల అభివృద్ధి వంటి నీటి సంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ తనిఖీలు నిర్వహిస్తూ మండలస్థాయి అధికారులతో నిరంతరం సమీక్షలు చేపట్టి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే జీపీఎస్‌పీ)మాన్యువల్ తయారీని పూర్తి చేసి ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి మూడేళ్ల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యతోపాటు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్

- **నిర్మాణ పనులు వేగవంతం చేయాలి**
- **విలువలతో కూడిన విద్యకు పెద్ద పీట**
- **బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలి**
- **డీజీపీ ఆనంద్**

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**



ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) దేశానికే ఆదర్శ విద్యాసంస్థగా ఎదగాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఆకాంక్షించారు. మంచిరేవులలో నిర్మాణంలో ఉన్న పాఠశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన స్కూల్ సొసైటీ కమిటీ సమావేశంలో ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం(ఐపీఎస్ ఓడబ్ల్యు) అధ్యక్షురాలు లలితా ఆనంద్, కమిటీ సభ్యులతో కలిసి నిర్మాణ పురోగతి, విద్యా ప్రణాళికలు, మౌలిక సదుపాయాలను సమీక్షించారు. పోలీసు పిల్లల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ పాఠశాల అభివృద్ధికి ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం కూడా తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించింది. సమావేశానికి ముందు డీజీపీ విద్యార్థులతో మమేకమై ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం విలు విద్య, ఫెన్సింగ్ తదితర క్రీడల ప్రదర్శనలను వీక్షించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పోలీసు సిబ్బంది పిల్లలు, అమర పోలీసుల కుటుంబాల పిల్లలు, సాధారణ ప్రజల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని డీజీపీ తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి అంశాలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం వంటి దుష్ప్రవర్తనలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలో విలువల ఆధారిత విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమాజం, దేశం పట్ల బాధ్యతతో కూడిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే కేంద్రంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిలవాలని ఆకాంక్షించారు. సమీక్షలో పాఠశాల భవనాల నిర్మాణ పురోగతి, విద్యా విధానం, పాఠ్య ప్రణాళిక, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. పెండింగ్ ప్రతిపాదనలు, బిల్లులు, అభివృద్ధి పనులను పరిశీలించి అవసరమైన ఆమోదాలు మంజూరు చేశారు. సీనియర్ పోలీసు అధికారులు తరచూ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, దేశభక్తి, ప్రజాసేవపై మార్గదర్శనం చేయాలని డీజీపీ సూచించారు. గత ఏడాది 125 మంది విద్యార్థులతో ప్రారంభమైన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో ప్రస్తుతం 2026-27 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి వరకు మొత్తం 345 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డీజీ (ఆక్టోపస్) డా. అనిల్ కుమార్, ఐజీ (ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్) గజారావు భూపాల్, సైబరాబాద్ సిపి రమేష్, ఐజీ (వెల్ఫేర్) ఉదయ్ కుమార్ రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ కుమార్, ప్రిన్సిపాల్ అనిత, వ్యవస్థాపకుడు విశాల్, పాఠశాల సిబ్బంది తో పాటు తదితరులు పాల్గొన్నారు.




# ఫుడ్ పాయిజన్‌పై టీజీహెచ్‌ఆర్‌సీ సుమోటోగా కేసు

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

ఎస్టీ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్‌ఆర్‌సీ) సుమోటోగా కేసు నమోదు చేసింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం వల్ల 27మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ఓ పత్రికలో మంగళవారం వార్త ప్రచురితం కావడంపై చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలోని మానవ హక్కుల కమిషన్ స్వయంచాలకంగా (సుమోటోగా) కేసు నమోదు చేసింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, అస్వస్థతకు గురైన విద్యార్థినుల సంఖ్య, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారికి అందించిన వైద్య చికిత్స, వసతి గృహంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, పారిశుధ్యంపై నిర్వహించిన విచారణ ఫలితాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న నివారణ, సరిదిద్దే చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. సెప్టెంబర్ 7వ తేదీలోగా విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేసును వాయిదా వేసింది.

# వరంగల్‌కు మెడికల్ హబ్ హోదా

- **రాష్ట్రంలో రెండో అతిపెద్ద వైద్య కేంద్రంగా అభివృద్ధికి కార్యాచరణ**
- **ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై మంత్రుల సమీక్ష**

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

వరంగల్‌ను తెలంగాణలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, వైద్య సేవలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్య సంస్థల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంజీఎం ఆసుపత్రి, సీకేఎం ఆసుపత్రి, కాకతీయ వైద్య కళాశాల, నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి తదితర సంస్థల అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, సిబ్బంది భర్తీ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యవసర విభాగం, డయాలసిస్, క్యాథ్‌ల్యాబ్, ఆక్సిజన్ సదుపాయాలు, ఆధునిక పరికరాల ఏర్పాటు, అవసరమైన వైద్య సిబ్బంది నియామకాన్ని వేగవంతం చేయాలని మంత్రులు సూచించారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎంజీఎం ఆసుపత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, పాత భవనాల మరమ్మతులు, విద్యుత్, ప్లంబింగ్, భద్రతా వ్యవస్థల బలోపేతంతో పాటు ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి కొండా సురేఖ కోరారు.

# మండల కేంద్రాల్లో ప్రజావాణి

- **ప్రతి సోమవారం మండల కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ**
- **ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం**
- **మండల స్థాయి అధికారులందరికీ తప్పనిసరి హాజరు**
- **స్థానికంగానే సమస్యల పరిష్కారానికి చర్యలు**
- **ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**



ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాష్ట్రంలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను మండల స్థాయిలోనే స్వీకరించి వేగంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి, వ్యవసాయ అధికారి, విద్యాశాఖ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, శిశు అభివృద్ధి అధికారి, సంక్షేమ శాఖ అధికారులు, విద్యుత్, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, రహదారులుభవనాలు, అటవీ శాఖలతో పాటు దాదాపు 23 శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది.

ఇప్పటివరకు భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, మౌలిక వసతులకు సంబంధించిన ఫిర్యాదుల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్త నిర్ణయంతో గ్రామీణ ప్రజలకు మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అవకాశం లభించనుంది. దీంతో ప్రయాణ భారం, సమయం, ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నమోదు చేసి, వాటి పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక నమోదు విధానం అమలు చేయనున్నారు. నిర్ణీత గడువులో ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

# ఉచిత చేప పిల్లల పంపిణీ కొనసాగిస్తాం

- **పెండింగ్ బకాయిల చెల్లింపునకు కృషి**
- **విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపలుపై ఆలోచన**
- **ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఆన్‌లైన్ ద్వారా చేపల పంపిణీ**
- **రూ.కోటి 34 లక్షల బీమా క్లియర్ చేశాం**
- **పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి**

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**



రాష్ట్రంలోని 26 వేల చెరువులు, వంద రిజర్వాయర్లలో చేపల పెంపకాన్ని విస్తరించడంతోపాటు మత్స్యకారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, మత్స్యరంగ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సహకార సంఘాల బలోపేతం లక్ష్యంగా జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు బీమా, మోపెడ్‌లు, రిటైల్ అవుట్‌లెట్ షాపుల ఏర్పాటు కోసం ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలపై సమీక్షిస్తామని వెల్లడించారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించడంతోపాటు మత్స్యకారులకు సంబంధించిన పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల పోషకాహారాన్ని మెరుగుపరిచే దిశగా మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు నెలకొన్న సహకార సంఘాల సభ్యత్వ వివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ కోహెడలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా చేపల విక్రయాలు, పంపిణీకి అవకాశం ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. మత్స్యకారులకు సంబంధించిన రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని తెలిపారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులకు ప్రొటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.

# అభ్యంతరకర పోస్టులపై ఫిర్యాదు చేయడం తప్పా?

**హైదరాబాద్, ఆగస్ట్ 4, ఆశ్వి అప్డేట్స్:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు. కిషన్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా అని ప్రశ్నించారు. సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్2, మణుగూరు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు వస్తాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని దోచుకున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# అగమ్యగోచరంగా ప్రభుత్వ హాస్పిటల్స్

**హైదరాబాద్,ఆగస్ట్ 4, ఆశ్వి అప్డేట్స్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ హాస్పిటల్స్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టుపెట్టారు. రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఎంసీహెచ్, జిల్లా హాస్పిటల్స్, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్సీలు మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్పిటల్స్ పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీష్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో శాఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రోడ్లెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్ :** పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతోపాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమనిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతోపాటు అన్ని ప్రక్రియలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక సర్కారు కార్యాలయాలకు టీఫైబర్ నెట్ సేవలు

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాట్లు చేయాలని టీ ఫైబర్ అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 1 తర్వాత ప్రైవేట్ ఆపరేటర్లకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ నిమిత్తం ఎలాంటి బిల్లులు చెల్లించొద్దని, 'టీస్వాన్'(TSWAN) నెట్‌వర్క్‌ను నెల రోజుల్లోగా టీఫైబర్‌కు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ'కి కూడా పూర్తిస్థాయిలో టీఫైబర్ ఇంటర్నెట్ సేవలు అందేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో చేపట్టిన 'ఇంటింటికి ఇంటర్నెట్ ' ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు తప ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి గింజా ప్రజల ఆస్తే

**మొదటిపేజీ తరువాయి**

లేకుండా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో గత దశాబ్ద కాలంగా జరిగిన ధాన్యం సేకరణ, సీఎంఆర్ బకాయిలు, ఎఫ్‌సీఐకి అప్పగించిన బియ్యం, జిల్లాల వారీగా, మిల్లర్ల వారీగా పెండింగ్ డిఫాల్ట్‌లు, రికవరీల పురోగతి, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలను విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం శిక్షలు విధించడం మాత్రమే కాదని, ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయిని పూర్తిగా తిరిగి రాబట్టడమేనని స్పష్టం చేశారు. అధికారులు వివరించిన మేరకు పెండింగ్ బకాయిల్లో ఎక్కువ భాగం గత ప్రభుత్వాల కాలంలో పేరుకుపోయినవేనని, ప్రస్తుతం వాటి రికవరీకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నగదు రూపంలో చెల్లింపులు, ధాన్యం తిరిగి అప్పగింత, నాణ్యమైన బియ్యం సరఫరా వంటి అన్ని మార్గాల ద్వారా గరిష్ఠ స్థాయిలో రికవరీలు సాధించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన పరిమిత గడువు కారణంగా ఇప్పటికే గణనీయమైన రికవరీలు జరిగాయని అధికారులు తెలిపారు. మిగిలిన ప్రతి కేసుపై మిల్లరు వారీగా గడువు నిర్ధారించి ప్రత్యేక రికవరీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

**ప్రతీ ధాన్యం గింజ వెనుక రైతు చెమట, ప్రజల సొమ్ము**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద కొనుగోలు చేసే ప్రతీ ధాన్యం గింజ వెనుక రైతు చెమటతోపాటు ప్రజల సొమ్ము ఉందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం ఎంపిక చేసిన రైస్ మిల్లర్లకు అప్పగిస్తుందని, వారు ఒప్పందం ప్రకారం నిర్దేశిత పరిమాణం, నాణ్యతతో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని గుర్తు చేశారు. మిల్లర్‌కు అప్పగించే ప్రతి బస్తా ధాన్యం ప్రభుత్వ ఆస్తి. అది ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తి. అందులో ఒక్క గింజ దారి మళ్లినా అది ప్రజలకు నష్టం. ప్రభుత్వానికి రావలసిన ఒక్క టన్ను బియ్యం తగ్గినా ప్రజా పంపిణీ వ్యవస్థ బలహీనపడుతుంది అని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. రాష్ట్రంలోని అత్యధికమంది రైస్ మిల్లర్లు నిజాయతీగా ప్రభుత్వంతో కలిసి పనిచేశారని, కొద్దిమంది మాత్రమే బియ్యం అప్పగింతలో జాప్యం చేయడం, ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించడం, ఒప్పందాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు.

**విజిలెన్స్ దాడులు కొనసాగుతాయి**

ప్రభుత్వ ధాన్యంపై నిర్వహించిన తనిఖీలు, దాడులు, నమోదు చేసిన క్రిమినల్ కేసులు, రికవరీలు, న్యాయపరమైన చర్యలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలు సమగ్ర నివేదిక సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల్లో భౌతిక తనిఖీలు, స్టాక్‌ల ధ్రువీకరణ, స్టాక్ రిజిస్టర్ల పరిశీలన, కొనుగోలు రికార్డులతో సరిపోల్చడం, ప్రభుత్వ ధాన్యం లేదా బియ్యం అక్రమ మళ్లింపులపై లోతైన విచారణ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. మోసం, ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం, నమ్మక ద్రోహం వంటి నేరాలకు ఆధారాలు లభించిన ప్రతి సందర్భంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు పదేపదే డిఫాల్ట్ చేస్తున్న మిల్లర్లపై బ్లాక్‌లిస్టింగ్ సహా కఠిన పరిపాలనా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**సీఎంఆర్ వ్యవస్థలో సమూల సంస్కరణలు**

గత డిఫాల్ట్‌ల సమీక్షతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సీఎంఆర్ నియంత్రణ ఉత్తర్వులను పూర్తిగా సవరించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఒప్పంద నిబంధనలను మరింత కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, డిఫాల్ట్‌లపై కఠిన శిక్షలు, అమలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించడం వంటి అంశాలను కొత్త విధానంలో చేర్చనున్నారు. పెండింగ్ రికవరీలు, ఆస్తుల జప్తు, బ్యాంకు గ్యారంటీల అమలు, సివిల్, క్రిమినల్ కేసుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించి రికవరీలకు అడ్డంకిగా ఉన్న ప్రతి పరిపాలనా అవరోధాన్ని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైతు చెమటతో పండిన ప్రతి గింజను ప్రభుత్వం ప్రజల సొమ్ముతో కొనుగోలు చేస్తున్నందున ప్రతి గింజకు ప్రభుత్వం కాపలాదారు. ప్రజల ఆస్తిని కాపాడటంలో, ప్రభుత్వ బకాయిలను పూర్తిగా రాబట్టడంలో, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

**సాంకేతికతతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ**

భవిష్యత్తులో ఒక్క గింజ కూడా దారి మళ్లకుండా సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిలో క్యూఆర్ కోడ్‌తో గన్నీ సంచులు, జీపీఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్, జియో ట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ రీకన్సిలియేషన్, ప్రొక్యూర్‌మెంట్ -మిల్లింగ్ -ఎఫ్‌సీఐ డేటాబేస్‌ల అనుసంధానం, ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ, రిస్క్ ఆధారిత మిల్లుల ఆడిట్లు వంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. డిఫాల్ట్‌ల కారణంగా రైతులు ఏ విధంగానూ ఇబ్బంది పడరని మంత్రి స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో నేరుగా సకాలంలో చెల్లింపులు, సేకరణ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతాయని హామీ ఇచ్చారు. 'ప్రభుత్వంతో నిజాఅతీగా పనిచేస్తున్న రైస్ మిల్లర్లకు భయపడాల్సిన అవసరం లేదు.. వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. అయితే ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించే వారు, ఒప్పందాలను ఉల్లంఘించే వారు మాత్రం ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు' అని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, ప్రొక్యూర్‌మెంట్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, లీగల్, మార్కెటింగ్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలిటిక్స్ లో 'షార్ట్'ఫార్ములా

**మొదటిపేజీ తరువాయి**

గడుపుతోంది. దీంతో రాజకీయ సందేశాలను కూడా అదే తరహాలో రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. యువతను చేరుకునేందుకు చిన్న నిడివి వీడియోలకు ప్రాధాన్యం పెరుగుతోంది. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రత్యర్థులపై విమర్శలు వంటి అంశాలను కూడా సంక్షిప్త వీడియోల రూపంలో ప్రజలకు చేరవేస్తున్నారు.

**సెకన్లలోనే సందేశం చేరేలా వ్యూహం**

గంటల తరబడి ప్రసంగాల కంటే 15 నుంచి 30 సెకన్లలోనే బలమైన సందేశాన్ని అందించే కంటెంట్‌కు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సెల్ఫీ వీడియోలు, నేరుగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడే విధానం, యువతకు దగ్గరైన భాషను ఉపయోగించడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యేలా వీడియోలను రూపొందించేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ప్రచారంలో విజువల్ ప్రజెంటేషన్, భావోద్వేగాలు, సరళమైన సందేశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

**పీఆర్ బృందాల పాత్ర పెరుగుతోంది**

డిజిటల్ ప్రచారం కోసం రాజకీయ నాయకులు ప్రత్యేక ప్రజాసంబంధాల సంస్థలు, సోషల్ మీడియా నిపుణుల సేవలను వినియోగిస్తున్నారు. వీడియోల స్క్రిప్టులు, చిత్రీకరణ, ఎడిటింగ్, ప్రచార వ్యూహాలన్నింటినీ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. అయితే జెన్ జీ అభిరుచులు వేగంగా మారుతుండటంతో ప్రతి ప్రచారం విజయవంతం అవుతుందనే హామీ లేదు. అందుకే కొత్త ధోరణులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ వ్యూహాలను మార్చుకుంటున్నారు.

**వైరల్ కావడం ఒకటి.. ఓట్లుగా మారడం మరోటి**

సామాజిక మాధ్యమాల్లో లక్షల వ్యూస్, లైక్‌లు రావడం సులభమే అయినప్పటికీ వాటిని ఓట్లుగా మార్చుకోవడం మాత్రం రాజకీయ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. కృత్రిమంగా రూపొందించిన ప్రచారాన్ని యువత త్వరగా గుర్తించి ట్రోల్స్, మీమ్స్ రూపంలో వ్యతిరేక ప్రచారం చేసే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. అందుకే సహజత్వం, విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇస్తూ డిజిటల్ ప్రచారాన్ని రూపొందించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ రాజకీయ ప్రచారంలో మరింత కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, ఆగస్ట్ 4, ఆశ్వి అప్డేట్స్:**

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు. రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వర రావుపేట పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ రాష్ట్ర రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తున్నదని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను షేర్ చేశారు.



# సమగ్ర అభివృద్ధికి విద్యే కీలకం

**మొదటిపేజీ తరువాయి**

పేర్ల నమోదుపై లోక్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉన్నత విద్యను సమీక్షించారు. యూనివర్సిటీలు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా గ్రామీణ, వెనుకబడిన వర్గాలకు తమ సేవలను విస్తరించాలని సూచించారు. దేశంలోని మానవ వనరుల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే యువతకు విజ్ఞానంతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా ఎంజీయూ వీసీతోపాటు పలువురు వీసీలు మొదటి తరం విద్యార్థులలో ఆరోగ్య అవగాహన, హెచ్ఐబీ నివారణ, రక్తదానం, జీవన నైపుణ్యాల పెంపొందించడంలో రెడ్ రిబ్బన్ క్లబ్ లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రస్తావించారు. దీనిలో భాగంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ఏఎస్ఆర్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వం, పౌర సమాజంతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ లోక్ భవన్ తో సమన్వయంతో ముందుకు సాగాలని వీసీలు నిర్ణయించారు. సమావేశంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలను వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ వివరించారు. ఉన్నత విద్యా రంగానికి విశేష సేవలు అందిస్తున్న సీనియర్ వైస్ చాన్సలర్లలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్ ను గవర్నర్ పుష్పగుచ్చాలు అందచేసి ఘనంగా సన్మానించి అభినందించారు.

# మసాలాల్లో మహా కల్తీ

**హైదరాబాద్, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్‌లోని కాటేదాన్ ప్రాంతంలో హెచ్ ఫాస్ట్ అధికారులు భారీ కల్తీ మసాలా దందాను వెలికితీశారు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో నకిలీ మసాలా దినుసులు తయారు చేస్తున్న ముఠాపై నిర్వహించిన దాడుల్లో 25 టన్నుల కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకున్నారు. తయారీకి సిద్ధంగా ఉంచిన మరో 89 టన్నుల ముడి నిల్వలను కూడా అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**ప్రమాదకర రసాయనాలతో కల్తీ**

విచారణలో జీలకర్ర, లవంగాలు, షాజీరా, ఆవాలు, మెంతులు, సోంపు, చిన్న ఆవాలు వంటి నిత్యావసర మసాలా దినుసులకు బట్టలకు రంగులు అద్దేందుకు ఉపయోగించే ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు కలుపుతున్నట్లు తేలింది. లవంగాల నుంచి నూనె తీసిన తర్వాత మిగిలే వ్యర్థాలను సేకరించి వాటికి హానికర రసాయనాలు కలిపి మళ్లీ విక్రయానికి సిద్ధం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**బ్రాండెడ్ పేర్లతో విక్రయాలు**

కల్తీ చేసిన మసాలాలకు ప్రముఖ బ్రాండ్ల



ముద్రలు వేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఈ ప్రాసెసింగ్ కోసం ప్రత్యేక యంత్రాలను ఇండోర్ నుంచి తెప్పించి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తక్కువ ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తించారు.

**13 సంస్థల్లో సోదాలు**

ఈ దాడుల వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి మసాలాలకు రంగు, మెరుపు తీసుకురావడానికి ఇండస్ట్రియల్ ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్, కొన్ని చోట్ల హెయిర్ కలర్ కూడా ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

**ప్రజలకు హెచ్చరిక**

ఇలాంటి కల్తీ ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాల సమస్యలు, క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు వచ్చే ప్రమాదం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపామని, ఆహార భద్రతా చట్టం ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హెచ్‌ఫాస్ట్ ఏర్పాటు చేసిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 202 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తం 246 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అనుమానాస్పద ఆహార పదార్థాలు లేదా కల్తీ తయారీ కేంద్రాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## పాముకాటుకు భవన నిర్మాణ కార్మికుడు మృతి

**ఆశ్వి అప్డేట్స్ | రామన్నపేట**



భవన నిర్మాణ పనులు చేస్తుండగా పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మునిపంపుల గ్రామానికి చెందిన ఉండ్రాతి వెంకన్న (33) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత జూలై 31న కొత్తగూడెం గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విషపూరిత పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయనను రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు నల్గొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ సోమవారం (ఆగస్టు 3) మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో వెంకన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఉండ్రాతి నవనీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామన్నపేట ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



## జిల్లా వ్యాప్తంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు

- **'సైబర్ జాగ్రూక్తా దివస్'లో భాగంగా ప్రత్యేక ప్రచారం: ఎస్పీ స్నేహ మెహ్రా**

**ఆశ్వి అప్డేట్స్ | వికారాబాద్ | ఆగస్టు 4**

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 'సైబర్ జాగ్రూక్తా దివస్' కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తెలియని వ్యక్తులతో ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లనే వినియోగించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.




## ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- **మహిళల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని అధికారులకు ఆదేశం**

**ఆశ్వి అప్డేట్స్ | వికారాబాద్ | ఆగస్టు 4**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ మంగళవారం జిల్లా ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పనితీరు, కేసుల విచారణ పురోగతి, మహిళా బాధితులకు అందుతున్న సేవలను సమీక్షించారు.
మహిళలపై వేధింపులు, గృహహింస, కట్న వేధింపుల కేసుల్లో అధికారులు సున్నితంగా, వేగంగా స్పందించాలని, ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు భరోసా కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్, పునరావాస సేవలను సమర్థంగా అందించాలని ఆదేశించారు. స్టేషన్‌లో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, డిజిటల్ నమోదు విధానాన్ని పరిశీలించిన ఎస్పీ, మహిళల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంచేలా స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశం, ఎస్సైలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడిన పోలీస్.. చండూరు హెడ్ కానిస్టేబుల్‌కు ప్రజల ప్రశంసలు

- **డయల్-100 కాల్‌కు ఐదు నిమిషాల్లో స్పందన.. ఉరివేసుకున్న వ్యక్తిని రక్షించిన ఆదిమూలం శ్రీనివాస్**

**ఆశ్వి అప్డేట్స్ | నల్లగొండ | ఆగస్టు 4**

ఖాకీ అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాదు.. అవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడే భరోసా కూడా అని చండూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆదిమూలం శ్రీనివాస్ మరోసారి నిరూపించారు. ఉడతలపల్లి గ్రామంలో భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోందని డయల్ 100కు సమాచారం అందిన వెంటనే ఆయన కేవలం ఐదు నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ప్రాణాపాయ స్థితిలో ఉండటాన్ని గమనించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇంటి ప్రధాన ద్వారాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఉరిని తొలగించి బాధితుడికి వెంటనే సీపీఆర్ అందించి ఆసుపత్రికి తరలించడంతో అతని ప్రాణాలు నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ ధైర్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ ఆదిమూలం శ్రీనివాస్ సేవలను స్థానిక ప్రజలు హర్షిస్తూ అభినందనలు తెలిపారు. "సమయానికి పోలీసులు రాకపోయి ఉంటే ఒక నిండు ప్రాణం కోల్పోయేవాళ్లం" అంటూ గ్రామస్థులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. విధి పట్ల నిబద్ధత, మానవత్వం, సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఈ ఘటన ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసాన్ని పెంచింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారనే విషయాన్ని చండూరు పోలీసుల సేవ మరోసారి చాటి చెప్పింది.







## కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

- **పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి.. నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం**

**ఆశ్వి అప్డేట్స్ | ఖమ్మం | ఆగస్టు 4**

ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులు, సీజ్ చేసిన వాహనాలు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, డయల్ 100 కాల్స్‌కు స్పందన సమయాన్ని సమీక్షించిన కమిషనర్, బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. పేకాట వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ఏసీపీ తిరుపతి రెడ్డి, సీఐ సాగర్, ఎస్సై గోపి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరు లారీ డ్రైవర్లకు జైలు

- **ఐదు రోజుల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా**

**ఆశ్వి అప్డేట్స్ | సిద్ధిపేట | ఆగస్టు 4**



సిద్ధిపేట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి లారీలు నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లు పట్టుబడ్డారు. వారిని సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా, ఒక్కొక్కరికి ఐదు రోజుల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. శిక్ష పడిన వారిలో సిద్ధిపేట జిల్లా తోగుటకు చెందిన కాసార్ల మల్లేశం, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చుక్కల రవి ఉన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ చెట్టుక్రింది ముత్యం రాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేల జరిమానా సహా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ఆశ్వి అప్డేట్స్ | రంగారెడ్డి | ఆగస్టు 4**



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం, మంగళవారం సాయంత్రం 4:30 గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ క్రాస్‌రోడ్స్‌లోని భార్గవి బ్యాటరీ షాప్ సమీపంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడు భిక్షాటన చేసుకునే వ్యక్తిగా అనుమానిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతుడి వివరాలు మరియు మరణానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సంస్థాన్ నారాయణపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

- **రికార్డుల నిర్వహణ, ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన**

**ఆశ్వి అప్డేట్స్ | యాదాద్రి భువనగిరి | ఆగస్టు 4**



యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ మంగళవారం సంస్థాన్ నారాయణపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ డైరీ (జీడీ)తో పాటు స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ ఎస్‌హెచ్‌వో జగన్ పోలీస్ స్టేషన్ పనితీరు, చేపడుతున్న కార్యక్రమాలపై ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రికార్డుల సమర్థవంతమైన నిర్వహణ, ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన, ప్రజలకు అనుకూలమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

## హైవేపై గుంతలు పూడ్చిన సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు

- **రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**

**ఆశ్వి అప్డేట్స్ | సూర్యాపేట | ఆగస్టు 4**




సూర్యాపేట జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారి 65పై ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను మంగళవారం పూడ్చివేశారు. వర్షాలు, రహదారి విస్తరణ పనులు, భారీ వాహనాల రాకపోకల కారణంగా ఏర్పడిన గుంతల వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించిన ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది మట్టి, కంకరతో వాటిని తాత్కాలికంగా పూడ్చి రాకపోకలను సాఫీగా కొనసాగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ, వాహనదారుల భద్రతే పోలీసుల తొలి ప్రాధాన్యత అని తెలిపారు. హైవేపై ప్రయాణించే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, పరిమిత వేగంతో ప్రయాణించి ప్రమాదాలను నివారించాలని సూచించారు.

## ఇన్‌స్టా రీల్స్ వివాదం.. ప్రభుత్వ టీచర్ గౌతమి రాజీనామా ప్రకటన

- **తోటి ఉద్యోగుల ట్రోలింగ్, మానసిక వేధింపులే కారణమని వెల్లడి**

**ఆశ్వి అప్డేట్స్ | ఖమ్మం | ఆగస్టు 4**

ఖమ్మం జిల్లా మామిళ్లగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు గౌతమి మరోసారి వార్తల్లో నిలిచారు. గతంలో ప్రైవేట్ విద్యాసంస్థల అడ్మిషన్లకు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వివాదంలో ఆరు నెలల పాటు సస్పెన్షన్‌కు గురైన ఆమె ఇటీవలే విధుల్లో చేరారు. అయితే విధుల్లో చేరిన అనంతరం తోటి ఉద్యోగుల నుంచి ట్రోలింగ్, మానసిక వేధింపులు ఎదుర్కొంటున్నానని పేర్కొంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలు, అనంతరం ఎదురైన పరిస్థితులు తీవ్ర మానసిక వేదనకు గురిచేశాయని గౌతమి వెల్లడించారు. ఈ పరిణామం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, ఆమె రాజీనామాపై విద్యాశాఖ అధికారులు ఎలా స్పందిస్తారనే అంశంపై ఆసక్తి నెలకొంది.



## క్రమశిక్షణతోనే విజయం సాధ్యం: ఎస్పీ నరసింహ

- **నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన**

**ఆశ్వి అప్డేట్స్ | సూర్యాపేట | ఆగస్టు 4**

క్రమశిక్షణతో కూడిన అలవాట్లు మంచి భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సూర్యాపేట పోలీసులు, బ్రహ్మకుమారీస్ సంయుక్త ఆధ్వర్యంలో జయ పాఠశాలలో నిర్వహించిన డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, సోషల్ మీడియాకు బానిసలు కాకుండా సాంకేతికతను విద్య కోసం వినియోగించాలని సూచించారు. బాలికలను ఎవరైనా వేధిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, మహిళలు, బాలల రక్షణకు పోలీస్ అక్క వంటి కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించగా, జిల్లా పోలీస్ కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించింది. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్సైలు, షీ టీమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## వృద్ధురాలి మెడలో బంగారు పుస్తెలతాడు చోరీ కేసు ఛేదించిన ఏన్కూర్ పోలీసులు

- **ఇద్దరు నిందితుల అరెస్టు.. బంగారం స్వాధీనం**

**ఆశ్వి అప్డేట్స్ | ఖమ్మం | ఆగస్టు 4**

ఏన్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం తండాలో వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెల తాడును చోరీ చేసిన కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, చోరీకి గురైన బంగారు పుస్తెలతాడును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం, శ్రీరాంపురం తండాకు చెందిన భూక్య హర్షవర్ధన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలానికి చెందిన బానోత్ కిషోర్ హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ అప్పుల ఒత్తిడితో ఈ చోరీకి పాల్పడ్డారు. ముందస్తు ప్రణాళికతో జూలై 31 అర్ధరాత్రి వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించిన నిందితులు, ఆమె నిద్రిస్తున్న సమయంలో మెడలోని బంగారు పుస్తెలతాడును బ్లేడ్‌తో కట్ చేసి అపహరించారు. అనంతరం దానిని హైదరాబాద్‌లో విక్రయించి అప్పులు తీర్చుకోవాలని భావించినట్లు విచారణలో వెల్లడైంది. కేసు నమోదు అనంతరం దర్యాప్తు చేపట్టిన ఏన్కూర్ పోలీసులు అనుమానితుల కదలికలపై నిఘా ఉంచి, ఆగస్టు 4న తూతిక్కలింగన్నపేట బ్రిడ్జి సమీపంలో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని బంగారాన్ని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏసీపీ వసుంధర యాదవ్ మాట్లాడుతూ, అప్పుల ఒత్తిడితో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసును వేగంగా ఛేదించిన ఎస్సై ఎన్. సంధ్యతో పాటు హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, కానిస్టేబుళ్లు రాజా, దేవేంద్ర, రవి, శంకర్, వినయ్, హోంగార్డ్ రాములను అభినందించారు.







# పేదల బియ్యంపై దోపిడి..!

- పీడీఎస్ బియ్యం మళ్లింపు.. అక్రమ వ్యాపారంగా మారుతున్న దందా
- మిల్లర్లు – మధ్యవర్తులు – అక్రమ రవాణా ముఠాల కుమ్మక్కుతో ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం?

**ఆశ్వి అప్డేట్స్ ప్రత్యేక ప్రతినిధి**



పేద ప్రజలకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం అక్రమ రవాణా మళ్లీ ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, మిల్లుల్లో పాలిష్ చేసి సాధారణ బియ్యంగా లేదా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. పోలీసులు, సివిల్ సప్లైస్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేసి వేలాది బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ ఈ అక్రమ వ్యాపారం పూర్తిగా అరికట్టలేకపోతున్నారు.

**పేదల బియ్యం.. వ్యాపారులకు బంగారు గని**

ప్రభుత్వం తక్కువ ధరకు పంపిణీ చేసే బియ్యాన్ని కొందరు మధ్యవర్తులు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ బియ్యాన్ని మిల్లులకు తరలించి పాలిష్ చేసి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించడం ద్వారా భారీ లాభాలు ఆర్జిస్తున్నట్లు అధికారుల దాడుల్లో గతంలో అనేక సందర్భాల్లో బయటపడింది.

**మిల్లుల పాత్రపై అనుమానాలు**

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో కొందరు మిల్లుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. సరైన రికార్డులు లేకుండా బియ్యం నిల్వలు, ప్రాసెసింగ్, రవాణా వంటి అంశాల్లో లోపాలు ఉంటే అక్రమాలకు అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఏ మిల్లుపైనా ఆరోపణలు నిర్ధారణ కాకముందు విచారణలో తేలాల్సి ఉంటుంది.

**పర్యవేక్షణ బలోపేతమే పరిష్కారం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రతి మిల్లులోకి వచ్చే ధాన్యం, బయటకు వెళ్లే బియ్యం, నిల్వలు అన్నీ పూర్తిగా డిజిటల్ ట్రాకింగ్‌లో ఉండాలి. జీపీఎస్ ఆధారిత రవాణా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

**ప్రభుత్వానికి రెట్టింపు నష్టం**

పీడీఎస్ బియ్యం మళ్లింపు వల్ల ప్రభుత్వ సబ్సిడీ దుర్వినియోగం కావడమే కాకుండా, నిజమైన లబ్ధిదారులకు నష్టం జరుగుతుంది. అక్రమ వ్యాపారుల చేతుల్లో ప్రభుత్వ ధాన్యం వ్యాపార వస్తువుగా మారడం వల్ల ప్రజాపంపిణీ వ్యవస్థపై కూడా ప్రభావం పడుతోంది.

**తరచూ వెలుగులోకి వస్తున్న కేసులు**

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పోలీసులు, టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లైస్ అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో తరచూ పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణా కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఈ అక్రమాల వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**నిపుణుల సూచనలు**

ప్రతి బియ్యం బస్తాకు డిజిటల్ ట్రాకింగ్ అమలు చేయాలి.

మిల్లుల నిల్వలను ఆన్‌లైన్‌లో రియల్‌టైమ్ పర్యవేక్షించాలి.

అక్రమ రవాణాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేయాలి.

దోషులుగా తేలిన మిల్లుల లైసెన్సులను రద్దు చేయాలి.

అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు, నిల్వ, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**ప్రజల డిమాండ్**

పేదల కోసం ఉద్దేశించిన ఒక్క బియ్యం గింజ కూడా అక్రమంగా మళ్లకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో దోషులుగా తేలిన వారిపై రాజకీయ, ఆర్థిక ప్రభావాలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# బిడ్డకు తల్లిపాలు అమృతం

- మోతె అంగన్వాడి కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

**ఆశ్వి అప్డేట్స్ | అక్బర్‌పేట భూంపల్లి | ఆగస్టు 4**

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా అందించడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని మోతె గ్రామ సర్పంచ్ మడ్డి శ్రీనివాస్ గౌడ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని మోతె అంగన్వాడి కేంద్రాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యత, పుట్టిన వెంటనే ఇవ్వాల్సిన ముర్రుపాల విలువ, వాటిలోని పోషకాలు, శిశువు రోగ నిరోధక శక్తి పెంపులో తల్లిపాల పాత్రను వివరించారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుతో పాటు తల్లికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, బాలింతలు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్, అంగన్వాడి టీచర్లు రామచూడక్క, స్వరూపరాణి, మమత, ఆశా వర్కర్లు లలిత, జ్యోతి, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# చిట్యాల టీటీడీ కళ్యాణ మండపం భూమిని కాపాడాలి

- సర్వే నంబర్ 649 భూమిపై బీఆర్ఎస్ ఆందోళన – అగ్రిమెంట్ ప్రకారమే మున్సిపాలిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్

**ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల పట్టణంలోని సర్వే నంబర్ 649లో టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణం కోసం కొనుగోలు చేసిన ఎకరం 12 గుంటల భూమిని సేల్ అగ్రిమెంట్ ప్రకారమే వెంటనే మున్సిపాలిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం ప్రతిపాదిత కళ్యాణ మండపం స్థలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు బొబ్బల శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ, చిట్యాల పట్టణ ప్రజల అవసరాల కోసం 2002లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, దాతలు కలిసి విరాళాలతో నిధులు సమీకరించి సర్వే నంబర్ 649లోని ఎకరం 12 గుంటల భూమిని రూ.2.50 లక్షలకు కొనుగోలు చేసేందుకు సేల్ అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. భువనగిరి రోడ్డుకు ఆనుకుని 129 అడుగుల ముఖద్వారం కలిగిన ఈ స్థలంలోనే కళ్యాణ మండపం నిర్మించాలని అప్పట్లో నిర్ణయించారని గుర్తు చేశారు. ఈ విషయంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులకు లేఖ రాయగా, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా సహకరించారని పేర్కొన్నారు. పలు సాంకేతిక కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ఆలస్యమైనప్పటికీ, భూ యజమానులు అగ్రిమెంట్‌లో పేర్కొన్న అదే భూమిని మున్సిపాలిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వినతిపత్రం ఇచ్చారని తెలిపారు. అయితే, అసలు స్థలానికి బదులుగా వెనుక వైపు ఉన్న భూమిని కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొంతమంది రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని ప్రజల చందాలతో కొనుగోలు చేసిన విలువైన స్థలాన్ని అన్యాక్రాంతం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సేల్ అగ్రిమెంట్‌లో ఉన్న అసలు భూమినే మున్సిపాలిటీ పేరిట నమోదు చేసి, అక్కడ టీటీడీ కళ్యాణ మండపంతో పాటు ప్రభుత్వ కళాశాలలు లేదా ఇతర ప్రజాప్రయోజన సంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను అఖిలపక్ష నాయకులతో కలిసి కలిసి కలుస్తామని, ప్రజా ఆస్తి అన్యాక్రాంతం కాకుండా పోరాడతామని హెచ్చరించారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపం కోసం కేటాయించిన భూమిని కాపాడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ కన్నుమూత

- విలన్ పాత్రలతో ప్రేక్షకుల మన్ననలు పొందిన విలక్షణ నటుడికి సినీ ప్రపంచం నివాళి

**ముంబయి, ఆగస్టు 5:**

భారత సినీ పరిశ్రమలో విలన్ పాత్రలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. ముంబయిలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మృతితో భారతీయ సినీ పరిశ్రమ ఓ విలక్షణ నటుడిని కోల్పోయిందని సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ప్రదీప్ సింగ్ రావత్ తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం తదితర భారతీయ భాషల చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా ప్రతినాయక పాత్రల్లో ఆయన నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గంభీరమైన హావభావాలు, విలక్షణమైన సంభాషణ శైలి, తెరపై తనదైన హావభావాలతో ఆయన విలన్ పాత్రలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. తెలుగు సినీ పరిశ్రమలో 'సై', 'ఛత్రపతి', 'గజిని' వంటి విజయవంతమైన చిత్రాల్లో ఆయన పోషించిన ప్రతినాయక పాత్రలు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. హీరోలకు ధీటుగా నిలిచే విలన్‌గా ఆయన నటన విశేష ప్రశంసలు అందుకుంది.సినిమాలతో పాటు టెలివిజన్ రంగంలోనూ ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. హిందీలో ప్రసారమైన ప్రముఖ ధారావాహిక *'మహాభారత్'*లో అశ్వత్థామ పాత్రలో నటించి విశేష గుర్తింపు పొందారు. తన సినీ జీవితంలో వందకు పైగా చిత్రాల్లో నటించిన ఆయన అనేక భాషల్లో ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. ప్రదీప్ సింగ్ రావత్ మరణ వార్త తెలిసిన వెంటనే సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భారతీయ సినీ రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.



# తెలంగాణ అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

- భవిష్య ఆరోగ్యంపై ఆరా.. విజయవంతమైన శస్త్రచికిత్స అనంతరం కుటుంబంతో భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 5:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ఉద్యమ అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

గత నెల మొయినాబాద్ సమీపంలో యాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన సందర్భంగా, యాదిరెడ్డి తమ్ముడి కుమార్తె భవిష్య ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని కేటీఆర్ తెలిపారు. దీనిపై స్పందించి పార్టీ తరఫున ఆమె శస్త్రచికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల భవిష్య విజయవంతంగా శస్త్రచికిత్స చేయించుకుని పూర్తిగా కోలుకోవడంతో, కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కేటీఆర్, భవిష్య సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఎదిగి, చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, అవసరమైన సందర్భాల్లో పార్టీ తరఫున సహాయం అందిస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.





# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఘన సన్మానం

**ఆశ్వి అప్డేట్ | నారాయణపేట | ఆగస్టు 4**

ఉట్కూరు మండలం ఆవుసలోని పల్లి గ్రామ ఉప సర్పంచ్ ఎల్కోటి చెన్నప్ప నారాయణపేట జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయనకు గ్రామ సర్పంచ్ దాసరి ఎల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి మాధురిక, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎల్కోటి చెన్నప్ప మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. చిన్న గ్రామపంచాయతీలకు తగినంత నిధులు అందక అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పనిచేస్తూ ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానని చెప్పారు.ః ఈ కార్యక్రమంలో తిమ్మయ్య, శ్రీనివాసులు, వడ్ల లక్ష్మయ్య, రాజారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త సావిత్రమ్మ, గ్రామ పెద్దలు పోలప్ప, శాంతప్ప, దేశాయిరెడ్డి, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# దామర్‌గిద్ద మండల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన తెలంగాణ రక్షణ సేన నాయకులు

- గురుకుల పాఠశాల తరలింపు, కొత్త ప్రభుత్వ భవనాల నిర్మాణానికి విజ్ఞప్తి

**ఆశ్వి అప్డేట్ | నారాయణపేట | ఆగస్టు 4**

నారాయణపేట జిల్లా కలెక్టర్ దామర్‌గిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను మంగళవారం తనిఖీ చేసిన సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ కలెక్టర్‌ను కలిసి మండలంలోని పలు ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుతం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం సమీపంలో కొనసాగుతున్న ఎస్సీ గురుకుల పాఠశాలను దామర్‌గిద్ద మండల కేంద్రానికి తరలించాలని కోరారు. అలాగే కాందేన్పల్లి గ్రామ ప్రభుత్వ భూమిలో ఎస్సీ గురుకుల హాస్టల్‌తో పాటు పాఠశాల భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకుని పరిపాలన నిర్వహణకు అనువుగా లేకపోవడంతో కొత్త భవనాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అదేవిధంగా దామర్‌గిద్ద తండాలోని ప్రభుత్వ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి, పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్న కారణంగా విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారిందని తండా సర్పంచ్ శరణ్య నాయక్‌తో కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే తండాను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నూతన పాఠశాల భవనం మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు, పార్టీ నాయకులు ఉలిగుండం మహేష్, మాజీ ఎంపీటీసీ శేఖర్, లోకుర్తి మాజీ సర్పంచ్ సుదర్శన్, పెద్దెంపల్లి మాజీ సర్పంచ్ వీరేష్, తండా పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.





# బీజేపీ ఆత్మపరిశీలనకు ఇదే సమయం!

కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కీలక దశకు చేరుకుంది. ప్రస్తుతం పార్టీ, ప్రభుత్వం రెండింటి నిర్ణయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలదే కీలక పాత్ర. కాబట్టి వారు పరిస్థితులను సకాలంలో అంచనా వేయడం అవసరం. ఎందుకంటే దేశంలో పాలనపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అసంతృప్తి క్రమంగా పెరుగుతోందనే సంకేతాలు ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సూచిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఉంది. మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ కేవలం గుజరాత్‌లో మాత్రమే విజయాన్ని నమోదు చేయగా, అధికారంలో ఉన్న బీహార్, మధ్యప్రదేశ్‌లలో పరాజయం పాలైంది. సాధారణంగా అధికార పార్టీలకు ఉప ఎన్నికల్లో అనుకూల వాతావరణం ఉంటుందనే రాజకీయ సూత్రానికి భిన్నంగా వచ్చిన ఈ ఫలితాలు ప్రజాభిప్రాయంలో మార్పుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఇక నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. విద్యార్థుల నిరసనలు, పార్లమెంట్ ముట్టడి వంటి పరిణామాల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని కేవలం రాజకీయ పరిణామంగా కాకుండా, విద్యా వ్యవస్థపై యువతలో పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతిబింబంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ప్రారంభంలో ఈ ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోని ప్రధాన స్రవంతి మీడియా కూడా చివరకు దాని ప్రాధాన్యాన్ని గుర్తించాల్సి వచ్చింది. చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, విద్యార్థి ఉద్యమాలను ఏ ప్రభుత్వం తేలికగా తీసుకున్నా దాని రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో జరిగిన ప్రజా ఉద్యమాల నుంచి తెలంగాణ ఉద్యమం వరకు యువత పోషించిన పాత్ర కీలకమైనది. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత ఆకాంక్షలు, ఆవేదనలను విస్మరించడం ఏ ప్రభుత్వానికీ శ్రేయస్కరం కాదు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 242 సీట్లకే పరిమితం కావడం కూడా ప్రజలు ఇచ్చిన ఒక హెచ్చరికగానే విశ్లేషించాలి. తాజాగా ఉప ఎన్నికల ఫలితాలు ఆ హెచ్చరికను మరింత బలపరిచినట్లు కనిపిస్తున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పెరుగుతున్న పన్నుల భారం, విద్యా, వైద్య రంగాల్లో సామాన్యులకు పెరుగుతున్న ఆర్థిక భారాలు ప్రజల్లో అసంతృప్తికి కారణాలుగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక ప్రత్యేక రాజకీయ సందేశాన్ని ఇచ్చింది. జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విజయం కేవలం ఒక నియోజకవర్గ ఫలితం మాత్రమే కాదు, బీజేపీకి బలమైన రాజకీయ హెచ్చరికగా కూడా పలువురు విశ్లేషిస్తున్నారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానంలో పరాజయం ఎదురుకావడం, ముఖ్యంగా అగ్రవర్ణ ఓటర్ల ప్రాబల్యం ఉన్న నియోజకవర్గంలో ఈ ఫలితం రావడం పార్టీకి ఆలోచన కలిగించే అంశం. నీట్ వివాదం, విద్యార్థుల ఆందోళనలు, నిరుద్యోగ సమస్య, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలు యువత ఓటింగ్ ధోరణిపై ప్రభావం చూపినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. యువతతో పాటు మధ్యతరగతి, వృద్ధులు కూడా మార్పు కోరుకుంటున్నారనే సంకేతాలు ఈ ఎన్నికల్లో కనిపించాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు బలహీనంగా ఉండొచ్చు కానీ, ప్రతిపక్ష భావజాలం మాత్రం బలంగా ఉందన్న ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్య కూడా ఈ నేపథ్యంలో ప్రస్తావనీయమే. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు కేవలం విజయాలు, పరాజయాలను మాత్రమే సూచించవు. అవి ప్రజల మనోభావాలకు అద్దం పడతాయి. అందువల్ల ఉప ఎన్నికల ఫలితాలు, విద్యార్థి ఉద్యమాలు, యువతలో పెరుగుతున్న అసంతృప్తిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం సీరియస్‌గా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. విద్యా రంగంలో సంస్కరణలు, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణ, ధరల నియంత్రణ, పన్నుల భారాన్ని తగ్గించడం, సామాన్యులకు అందుబాటులో విద్యా, వైద్య సేవలు అందించడం వంటి అంశాల్లో వేగంగా చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయగలుగుతారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, కాలానుగుణంగా విధానాల్లో మార్పులు తీసుకురాగలిగినప్పుడే ఏ రాజకీయ పార్టీ అయినా దీర్ఘకాలికంగా ప్రజల మద్దతును నిలబెట్టుకోగలదనేది ప్రజాస్వామ్య చరిత్ర చెప్పే వాస్తవం.

# ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ

- నాణ్యతపై ఆందోళన అవసరం లేదు.. కఠిన తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడి
- ఈ20 పెట్రోల్ నాణ్యతపై కేంద్రం వివరణ
- దేశవ్యాప్తంగా 87 వేలకుపైగా బంకుల్లో నిరంతర పరీక్షలు
- నాణ్యత లేని 302 ఇథనాల్ ట్యాంకర్లను తిరస్కరించిన కేంద్రం
- కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఇథనాల్ కొనుగోలు నుంచి బంకుల వరకు బహుళస్థాయి తనిఖీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌పై కొనసాగుతున్న చర్చల నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ కీలక వివరణ ఇచ్చింది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కారణంగా వాహనాల ఇంజిన్లకు నష్టం జరుగుతోందన్న ప్రచారంపై స్పందించిన కేంద్రం, ఇంధన నాణ్యత విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా కఠినమైన నాణ్యత నియంత్రణ వ్యవస్థ అమల్లో ఉందని వెల్లడించింది.

**నిరంతర నాణ్యత పరీక్షలు**

దేశవ్యాప్తంగా ఉన్న 87 వేలకుపైగా పెట్రోల్ బంకుల్లో రోజుకు 8 నుంచి 12 సార్లు ఇంధనంలో నీటి కలుషితాన్ని పరీక్షిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. క్లోరైడ్, సల్ఫైడ్ వంటి కలుషితాలను గుర్తించేందుకు ఇప్పటివరకు రెండు వేలకుపైగా నమూనాలను పరీక్షించినట్లు పేర్కొంది. దేశంలో కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే క్లోరైడ్ కలుషితం గుర్తించగా, ఆయా పెట్రోల్ బంకుల్లో విక్రయాలను వెంటనే నిలిపివేసినట్లు వెల్లడించింది.

**కల్తీకి కఠిన చర్యలు**

ఇంధనంలో కల్తీ లేదా కలుషితానికి పాల్పడినట్లు తేలిన రిటైల్ అవుట్‌లెట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. వాహనదారులకు నాణ్యమైన ఇంధనం అందేలా ప్రతి దశలో పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపింది.

**ఇథనాల్‌కు కఠిన ప్రమాణాలు**

ఈ20 పెట్రోల్ తయారీలో ఉపయోగించే ఇథనాల్ బీఐఎస్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కేంద్రం తెలిపింది. ఇథనాల్‌లో కనీసం 99.6 శాతం స్వచ్ఛత ఉండటం తప్పనిసరి అని పేర్కొంది. డిస్టిలరీల నుంచి పంపే ప్రతి బ్యాచ్‌ను నాణ్యత పరీక్షల అనంతరమే స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది.

**302 ట్యాంకర్లకు నిరాకరణ**

జూలై 2024 నుంచి జూన్ 2026 వరకు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని 302 ఇథనాల్ ట్యాంకర్ ట్రక్కులను తిరస్కరించినట్లు కేంద్రం తెలిపింది. సుమారు 10,500 కిలోలీటర్ల ఇథనాల్‌ను స్వీకరించకుండా వెనక్కి పంపినట్లు వెల్లడించింది. స్వచ్ఛత, నీటి శాతం, సాంద్రత వంటి ప్రమాణాల్లో లోపాలు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

**ప్రతి దశలో పర్యవేక్షణ**




ఇథనాల్ కొనుగోలు నుంచి డిపోల్లో నిల్వ, ఈ20 పెట్రోల్ తయారీ, పెట్రోల్ బంకులకు సరఫరా వరకు ప్రతి దశలోనూ నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఇంధన కలుషితంపై వస్తున్న ఫిర్యాదులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది.

## రాజీనామా చేస్తే వెంటనే ఆమోదం

- కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి.. డీకే శివకుమార్ హెచ్చరిక
- మంత్రివర్గ విస్తరణ తర్వాత కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు
- రాజీనామా చేస్తే నిమిషాల్లోనే ఆమోదిస్తానన్న ముఖ్యమంత్రి
- అసంతృప్త ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలుస్తానని స్పష్టీకరణ
- కరవు ప్రాంతాల పర్యటనకు కొత్త మంత్రులకు ఆదేశాలు
- బోర్డులు, కార్పొరేషన్లలో కొత్త నియామకాలకు సంకేతాలు

**బెంగళూరు, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

కర్ణాటక మంత్రివర్గ విస్తరణ అనంతరం కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి బహిర్గతమవుతోంది. మంత్రి పదవులు దక్కని పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, కొందరు పార్టీ పదవులకు రాజీనామాలు కూడా సమర్పించారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందిస్తూ, ఎవరైనా రాజీనామా చేస్తే కొన్ని నిమిషాల్లోనే ఆమోదిస్తానని హెచ్చరించారు. అదే సమయంలో అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా పిలిచి మాట్లాడి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఇటీవల పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణలో 20 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే కొత్త మంత్రులు కరవు ప్రభావిత జిల్లాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించాలని డీకే శివకుమార్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి పదవులు దక్కని నేతలు ఓర్పుతో ఉండాలని సీఎం సూచించారు. తన రాజకీయ జీవితంలోనూ అనేకసార్లు మంత్రి పదవి రాకపోయినా పార్టీని వీడకుండా సహనంతో ఎదురుచూశానని గుర్తు చేశారు. రాజకీయ భవిష్యత్తు పార్టీతోనే ముడిపడి ఉంటుందని, భావోద్వేగ నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. మరోవైపు రాష్ట్రంలోని బోర్డులు, కార్పొరేషన్లలో కొత్త నియామకాలు చేపట్టనున్నట్లు డీకే శివకుమార్ వెల్లడించారు. ప్రస్తుతం ఆ పదవుల్లో ఉన్నవారు రాజీనామాలు సమర్పించాలని సూచిస్తూ, ముందుగా పార్టీ కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకుంటానని చెప్పారు. మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంపై విజయనగర ఎమ్మెల్యే ఎం. కృష్ణప్పకు మద్దతుగా పలువురు స్థానిక కాంగ్రెస్ పదాధికారులు సామూహిక రాజీనామాలు సమర్పించారు. ఇదే సమయంలో కేఎస్‌ఆర్‌టీసీ చైర్మన్, ఎమ్మెల్యే ఎస్.ఆర్. శ్రీనివాస్ కూడా తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కొందరు నేతలు తమ నిర్ణయాలను మార్చుకున్నారు. మంత్రి పదవి రాకపోవడంతో రాజీనామా చేస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే బెలూరు గోపాలకృష్ణ, ముఖ్యమంత్రితో సమావేశమైన తర్వాత తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. పార్టీతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. ఇంకోవైపు మహిళా ఎమ్మెల్యేలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న మహిళా మంత్రి పదవి కోసం పలువురు నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. తుమకూరు జిల్లాకు ప్రాతినిధ్యం దక్కలేదని మాజీ మంత్రి కేఎన్ రాజన్న వర్గం కూడా నిరాశ వ్యక్తం చేసింది. మొత్తంగా మంత్రివర్గ విస్తరణ అనంతరం కాంగ్రెస్‌లో చెలరేగిన అసంతృప్తిని చల్లార్చడం డీకే శివకుమార్ నాయకత్వానికి తక్షణ సవాలుగా మారింది. అసంతృప్త నేతలను సమన్వయం చేస్తూ పార్టీ ఐక్యతను కాపాడేందుకు అధిష్ఠానం చర్యలు వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.

## వ్యాన్‌లోనే అరగంట బైఠాయించిన ఉదయనిధి

- పోలీసుల తీరుపై అభ్యంతరం.. చెంగిపట్టి స్టేషన్‌లో హైడ్రామా
- కేసు నమోదైన స్టేషన్‌కు కాకుండా మరో స్టేషన్‌కు తరలింపు
- వ్యాన్ దిగేందుకు తొలుత నిరాకరించిన ఉదయనిధి స్టాలిన్
- శాంతిభద్రతల కారణంగా మార్పు చేశామని పోలీసుల వివరణ
- చివరకు విచారణకు సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి
- తంజావూరు ఘటనతో తమిళనాడులో రాజకీయ దుమారం

**చెన్నై, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సంబంధించిన కేసు విచారణలో మంగళవారం ఉత్కంఠభరిత పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేసు నమోదు చేసిన తంజావూరు సౌత్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లకుండా, చెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఉదయనిధి అభ్యంతరం వ్యక్తం చేశారు. తనపై కేసు నమోదైన స్టేషన్‌కే తీసుకెళ్తేనే దిగుతానని స్పష్టం చేస్తూ సుమారు అరగంటపాటు పోలీస్ వ్యాన్‌లోనే కూర్చున్నారు.

**శాంతిభద్రతల కారణంగానే మార్పు**

తంజావూరు సౌత్ పోలీస్ స్టేషన్ వద్ద డీఎంకే, టీవీకే నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని పోలీసులు భావించారు. అందుకే ముందు జాగ్రత్త చర్యగా చెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు వివరించారు. ఈ నిర్ణయాన్ని ఉదయనిధికి పలుమార్లు వివరించినప్పటికీ, ఆయన తొలుత అంగీకరించలేదు.





**పోలీసులతో చర్చల తర్వాత విచారణకు హాజరు**

పోలీసులు పరిస్థితిని వివరించి నచ్చజెప్పడంతో ఉదయనిధి చివరకు వ్యాన్ నుంచి దిగారు. అనంతరం అక్కడ వేచి ఉన్న పార్టీ కార్యకర్తలకు అభివాదం చేసి చెంగిపట్టి పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లి విచారణకు హాజరయ్యారు. ఈ ఘటనతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విచారణ**

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై నమోదైన కేసులో మద్రాస్ హైకోర్టు ఆయనకు స్టేషన్ బెయిల్ ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. అదే సమయంలో విచారణకు పూర్తిగా సహకరించాలని కూడా సూచించింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు విచారణ చేపట్టగా, స్టేషన్ మార్పు అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

**రాజకీయంగా వేడెక్కిన వివాదం**

ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. డీఎంకే అధినేత స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండగా, ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయాల్లో మరింత వేడి పుట్టిస్తోంది.

# సీజేపీ దూకుడు

- నీట్ ఉద్యమం తర్వాత దేశవ్యాప్తంగా లిజనింగ్ టూర్
- యువతతో నేరుగా మమేకం కావాలని పార్టీ నిర్ణయం
- మహారాష్ట్రలో రెండు రోజుల కీలక సమావేశం
- జంతర్ మంతర్ ఉద్యమంలో పాల్గొన్న వాలంటీర్లతో చర్చలు
- నీట్ ఉద్యమం తర్వాత సంస్థాగత విస్తరణపై దృష్టి
- దేశవ్యాప్త పర్యటన షెడ్యూల్ త్వరలో వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 4, ఆశ్వి అప్డేట్స్:**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చేపట్టిన ఆందోళనలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. నీట్ ఉద్యమంతో వచ్చిన ఊపును కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా యువతతో నేరుగా మమేకం కావడానికి 'లిజనింగ్ టూర్' చేపట్టనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ పర్యటన ద్వారా యువత అభిప్రాయాలు, ఆశలు, సమస్యలను తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించింది.

**మహారాష్ట్రలో కీలక సమావేశం**

పార్టీ భవిష్యత్ వ్యూహాన్ని ఖరారు చేసేందుకు మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో బుధ, గురువారాల్లో రెండు రోజుల సమావేశం నిర్వహించనున్నట్లు సీజేపీ వెల్లడించింది. ఈ సమావేశానికి పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, అధికార ప్రతినిధులు, సంస్థాగత నాయకులు హాజరుకానున్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నీట్ వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సుమారు 50 మంది వాలంటీర్లతో పాటు పలువురు భాగస్వాములతో చర్చించిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

**నీట్ ఉద్యమాన్ని విజయంగా అభివర్ణించిన పార్టీ**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చేపట్టిన ఉద్యమం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, రెండు నెలలపాటు సాగిన ఆందోళన విజయవంతమైందని సీజేపీ పేర్కొంది. ఈ ఉద్యమం యువతలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, యువశక్తి ఏకమైతే ప్రభుత్వాలను కూడా నిర్ణయాలు మార్చే స్థాయికి తీసుకెళ్లగలదని పార్టీ అభిప్రాయపడింది.

**యువతతో ప్రత్యక్ష అనుసంధానమే లక్ష్యం**

యువత అంచనాలను అర్థవంతమైన కార్యాచరణగా మార్చేందుకు పార్టీ కృషి చేస్తోందని సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. దేశవ్యాప్త లిజనింగ్ టూర్ షెడ్యూల్, నిర్వహణ విధానం తదితర వివరాలను త్వరలో ప్రకటిస్తామని పార్టీ వెల్లడించింది. నీట్ ఉద్యమంతో ఏర్పడిన మద్దతును కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా సంస్థాగతంగా మరింత విస్తరించడంలో ఈ పర్యటన కీలకంగా మారుతుందని సీజేపీ భావిస్తోంది.




# మద్యం తాగితే శరీరంలో ఏం జరుగుతుంది ?

మద్యం తాగడాన్ని ఒక సరదాగా ప్రారంభించి, దానిని ఒక అలవాటుగా మార్చుకుంటూ ఉంటారు. అయితే మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం అని డాక్టర్లు పదే పదే చెబుతున్నారు. మద్యం సేవించడం వల్ల అనేక తీవ్రమైన నష్టాలు మన ఆరోగ్య విషయంలో వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి అవేమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం.



మద్యపానం కారణంగా ఎముకల బలహీనత .. సెక్స్ సామర్థ్యం తగ్గుదల అధికంగా మద్యాన్ని తీసుకోవడం వల్ల ఎముకల బలహీనత వస్తుంది. క్యాల్షియం మరియు విటమిన్ డి శరీరంలో సరిగా పనిచేయకుండా పోతాయి. కీళ్లలో నొప్పి, కాళ్లలో నొప్పి వంటి సమస్యలు పెరుగుతాయి.అధికంగా మద్యం తీసుకోవడం వల్ల సెక్స్ సామర్థ్యం తగ్గుతుంది. వీర్యకణాల నాణ్యత పడిపోతుంది. ఫలితంగా సంతానలేమి సమస్య కలుగుతుంది. మద్యపానంతో తీవ్ర నష్టాలు.. జాగ్రత్త కాబట్టి ఇన్ని అనర్థాలకు కారణం అయ్యే మద్యాన్ని అధికంగా సేవించడం మానుకోవాలి. పూర్తిగా మానేసిన ఎలాంటి ఇబ్బంది ఉండదు. తరచూ మద్యం సేవించే వాళ్ళు ఈ విషయాలు తెలుసుకుని, ఈ ప్రమాదాలను అర్థం చేసుకొని తదనుగుణంగా మద్యం సేవించడాన్ని కంట్రోల్ చేసుకోవాలి.



మద్యం సేవించటం వ్యసనం అయితే ప్రాణాలకే ప్రమాదం . చాలామంది సంతోషకర సమయమైనా, విచారకర సమయమైనా మద్యం సేవించడానికి ఇష్టపడతారు. మొదట సరదా.. తర్వాత అలవాటుగా.. ఆపై వ్యసనంగా మారుతుంది. అలా మద్యం సేవించడం వ్యసనంగా మారితే అది ప్రాణాల మీదకు తెస్తుంది. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంటే త్వరితగతిన దానిని మానుకోవలసిన అవసరం ఉంది. ఎదం టే ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోక తప్పదు.

మద్యం సేవించటం వ్యసనం అయితే ప్రాణాలకే ప్రమాదం . చాలామంది సంతోషకర సమయమైనా, విచారకర సమయమైనా మద్యం సేవించడానికి ఇష్టపడతారు. మొదట సరదా.. తర్వాత అలవాటుగా.. ఆపై వ్యసనంగా మారుతుంది. అలా మద్యం సేవించడం వ్యసనంగా మారితే అది ప్రాణాల మీదకు తెస్తుంది. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంటే త్వరితగతిన దానిని మానుకోవలసిన అవసరం ఉంది. ఎదం టే ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోక తప్పదు.

### మద్యపానం కారణంగా లివర్, ప్యాంక్రియాస్ కు ప్రమాదం

తరచూ మద్యం ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా దెబ్బతింటుంది. ఎక్కువ ఆల్కహాల్ తాగడం వల్ల లివర్ ఫెయిల్యూర్ అవుతుంది. కాలేయం వాపు సమస్య కూడా వచ్చే అవకాశం ఉంటుంది. ప్యాంక్రియాస్ అనేది ఇన్సులిన్ మరియు ఇతర రసాయనాలు ఉత్పత్తి అయ్యే శరీరంలోని అవయవం. మద్యపానం వల్ల ఇది ఎఫెక్ట్ అవుతుంది. ఇది ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కు కూడా దారితీస్తుంది. క్యాన్సర్, డయాబెటిస్, గుండె జబ్బుల ప్రమాదం మద్యం ఎక్కువ సేవించడం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. మద్యాన్ని తీసుకోవడం వల్ల ప్యాంక్రియాస్ లో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గుతుంది. అటువంటి పరిస్థితిలో రక్తంలో చక్కెరస్థాయిలు పెరుగుతాయి. ఫలితంగా మధుమేహం సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. నేషనల్ హార్ట్ అసోసియేషన్ చెప్పిన వివరాల ప్రకారం ఆల్కహాల్ గుండె ఆరోగ్యానికి హాని చేస్తుంది. ఆల్కహాల్ ఎక్కువ సేవించే వారిలో రక్తంలో కొవ్వు స్థాయిలు పెరిగి, హార్ట్ స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### హ్యాంగోవర్ ఎందుకు ఏర్పడుతుంది?


ఈ విషయంపై ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలను పరిశీలించినప్పుడు హ్యాంగోవర్ లక్షణాలకు వివిధ కారణాలు కనిపించాయి. వీటిలో మొదటిది నిర్జలీకరణం అంటే డీ హైడ్రేషన్.శరీరంలో సహజంగా ఏర్పడే రసాయన పదార్థాల సాంద్రత (కాన్సంట్రేషన్)ను ఆల్కాహాల్ తగ్గిస్తుంది. ఎక్కువ మొత్తంలో మద్యం తీసుకోవడం వల్ల ఇది ఏర్పడుతుంది. ఇలా తీసుకోవడం వల్ల రక్తంలో ఇథనాల్, దాని డీకంపోజిషన్ ఉత్పత్తుల సాంద్రత పెరుగుతుంది.అయితే, ఈ హ్యాంగోవర్ ఈ మార్పుల కారణంగానే ఏర్పడిందా అన్న మాత్రం స్పష్టం కాలేదు. దీని మీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ అసౌకర్యాన్ని కొందరు పరిశోధకులు వ్యాధి నిరోధకతతో ముడి పెట్టారు. మద్యం తీసుకున్నప్పుడు నొప్పి, మంటకు సంబంధించిన కొన్ని పదార్థాలు విడుదలవుతాయని, దీనివల్ల హ్యాంగోవర్ వంటి అసౌకర్యం ఏర్పడుతుందని భావించారు.

# కార్బన్ డై ఆక్సైడ్‌ను నిర్మూలించవచ్చా?

వృక్షాలు పర్యావరణ సంరక్షణకు సహకరిస్తాయి. కానీ, వాటంతట అవే వాతావరణ పునర్నిర్మాణానికి సహకరించవంటూ చాలా మంది ఈ వాదన పట్ల విమర్శలు చేశారు.గతంలో ఎన్నడూ లేనంతగా వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువులు ముఖ్యంగా కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుండటం వలన వాతావరణంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి.దీంతో ఐస్ షీట్లు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం, హరికేన్లు సంభవించడం, కరువు పెరగడం జరుగుతోంది. గ్రీన్‌హౌస్ వాయువులని వాతావరణంలోకి విడుదల చేయడం పూర్తిగా ఆపగలగడమే ఒక పరిష్కారం.

ఉదాహరణకి ఫాసిల్ (బొగ్గు, గ్యాస్ తరహా) ఇంధనాల వాడకానికి బదులు సోలార్ శక్తి ద్వారా నడిచే పరికరాలు వాడటం ఒక మార్గం.అడవులని నిర్మూలించడం ద్వారా వాతావరణంలోకి అత్యధిక శాతంలో కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుంది.2017లో ప్రపంచ వ్యాప్తంగా 41 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అయితే అందులో 4 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ అడవుల నిర్మూలన కారణంగా చోటు చేసుకుంది. చెట్లు నరకడం ఆపితే ఏటా విడుదల అయ్యే వ్యర్థాలలో 10 శాతం తగ్గించవచ్చుఅయితే ఇప్పటికే చాలా వినాశనం జరిగింది. గాలిలోంచి కార్బన్ డై ఆక్సైడ్‌ని నిర్మూలించడానికి సరైన మార్గాలు కనిపెట్టాల్సి ఉంది.ఇందుకోసం శాస్త్రవేత్తలు చాలా రకాలైన సాంకేతిక మార్గాలని ప్రతిపాదించారు. కానీ, వృక్షాలు కార్బన్ డై ఆక్సైడ్ గ్రహించడంలో ముఖ్యమైన పాత్రని పోషిస్తాయి. అయితే కొత్త మొక్కలు నాటడం కానీ, లేదా కొత్తగా అడవులని అభివృద్ధి చేయడం కానీ చేయాలి. చెట్లు సజీవంగా ఉన్నంతవరకు గాలిలో కార్బన్ డై ఆక్సైడ్‌ని అవి పట్టి ఉంచుతాయి.

ఇందుకోసం ముఖ్యంగా అమెజాన్ లాంటి అడవులని నాశనం చేయడం ఆపాలి.ప్రపంచంలో ఇంకా 0.9 బిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో అడవులని పెంచేందుకు అవకాశం ఉందని 2019లో స్విట్జర్లాండ్‌కి చెందిన థామస్ క్రౌథెర్ నిర్వహించిన ఒక అధ్యయనం పేర్కొంది.ఈ అడవులు అభివృద్ధి చెందితే 752 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ని గాలిలోంచి తీసుకోగలవని ఈ అధ్యయనం తెలిపింది.అయితే, ఈ అధ్యయనం ఇతర పర్యావరణ శాస్త్రజ్ఞుల నుంచి విమర్శలు ఎదుర్కొంది. చెట్లు నిల్వ ఉంచగలిగే కార్బన్ డై ఆక్సైడ్ శాతంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.క్రౌథెర్ విడుదల చేసిన అధ్యయనంలో చెట్లు నాటడానికి అందుబాటులో ఉన్నట్లు చెప్పిన స్థలంలో ఇప్పటికే చెట్లు ఉన్నాయని విమర్శించారు. వీటిని అక్టోబర్ 2019లో ఒక సైన్స్ పత్రిక ప్రచురించింది.







**పర్యావరణ మార్పుల నుంచి భూమిని రక్షిండం కోసం మొక్కను పెంచడం అనేది అందరికి తెలిసిన సాదాహారణ విషయం . అయితే ప్రపంచ అడవులను కాపాడటానికి వాటికి మరింత భద్రత కల్పించాలని, నరికిన వృక్షాలని తిరిగి నాటాలని సందేశం ఇస్తూ పర్యావరణ పరిరక్షక ప్రచారకురాలు గ్రెటా థన్‌బర్గ్ ఒక చిత్రాన్ని కూడా నిర్మించారు.ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షక ప్రచారకర్తలు పర్యావరణం కోసం రకరకాల ప్రచారాలను నిర్వహిస్తున్నారు.గత దశాబ్దంలో బ్రిటన్ ప్రభుత్వం కొన్ని కోట్ల మొక్కలు నాటింది. 2016లో భారతదేశంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క రోజులోనే 5 కోట్ల మొక్కలు నాటారు. ఇథియోపియా ఒకే రోజులో 35 కోట్ల మొక్కలు నాటినట్లు ప్రకటించుకుంది.ప్రస్తుతం ఉన్న అడవులని కాపాడుకుంటూ కొత్త వాటిని నాటడం మంచిదే. అయితే, పర్యావరణ పరిరక్షణ కోసం పూర్తిగా మొక్కల మీదే ఆధారపడకూడదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.**




### వాతావరణ సమస్యలు ఎదుర్కోవడానికి చెట్లు ఎంతవరకు ఉపయోగపడతాయి?

సహజ రీతుల్లో వాతావరణాన్ని పరిరక్షించాలంటే వెట్‌ల్యాండ్స్ (చిత్తడి నేలలు)ని సంరక్షించడం, ఇతర పరిరక్షక పద్ధతులని అవలంబించడం, పంట పొలాల నుంచి విడుదలయ్యే వ్యర్థాలని తగ్గించడం లాంటివి చెయ్యాలని 2017లో నిర్వహించిన ఒక అధ్యయనం పేర్కొంది. సహజ విధానాలను పాటించడం ద్వారా ప్రతి ఏటా 23.8 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ని బంధించి ఉంచుతాయని తెలిపింది. వాతావరణం విషయంలో అనిశ్చితి అయితే ఉంటుంది. వాతావరణం అనుకోని రీతిలో మార్పులకి లోనవుతూ ఉంటుంది.దీంతో చెట్లు పెరిగే తీరులో మార్పులు చోటు చేసుకుంటాయి.



# రసం పొడి.. సింపుల్‌గా ఇలా తయారుచేసుకోండి..

ఎన్ని వెరైటీలతో భోజనం లాగించినా .. చివర్లో రసంతో ఓ నాలుగు ముద్దలు పడితేనే చాలా మందికి భోజనం పరిపూర్ణమవుతుంది. కేవలం రసం కోసం భోజనం చేసే వారూ ఉంటారు. ముఖ్యంగా దక్షిణభారతదేశంలో రసం కు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. అయితే రుచికరంగా రసం తయారు చేయడం అంత ఈజీ కాదు. బాగా తలలు పండిన మన అమ్మొమ్మలు, బామ్మలు మాత్రమే టెస్టీగా రసం తయారు చేస్తారు. ఇక రసం రుచిగా ఉండాలంటే రసం పొడి తయారుచేసుకోవడం ఎంతో ముఖ్యం. అసలు రసం పొడి ఎలా తయారుచేసుకోవాలా ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు**

- **ఎండుమిర్చి - 15**
- **మిరియాలు - పావు కప్పు**
- **కందిపప్పు - పావు కప్పు**
- **జీలకర్ర- పావు కప్పు**
- **ధనియాలు - ఒక కప్పుల**
- **కరివేపాకులు - ఐదు రెబ్బలు**



### రసం పొడి ఇలా తయారు చేసుకోండి..




ముందుగా స్టవ్ మీద కళాయి పెట్టి ధనియాలు వేసి వేయించాలి. వీటిని చిన్న మంట మీద వేయిస్తే బాగా వేగుతాయి. తర్వాత జీలకర్ర, కందిపప్పు, మిరియాలు, ఎండుమిర్చి కూడా వేసి వేయించాలి. చివరిలో నాలుగు కరివేపాకు రెమ్మలు వేసుకోవాలి. ఇవన్నీ చల్లారాక మిక్సీ జార్లో వేయాలి. ఒక టేబుల్ స్పూన్ పసుపు, అర స్పూన్ ఇంగువ కూడా వేసి అన్ని మెత్తగా పొడిలా చేసుకోవాలి.. దీన్ని గాలి చొరబడని ఒక డబ్బాలో వేసి ఫ్రిజ్లో పెట్టుకోవాలి.. ఆరు నెలల వరకు ఇది తాజాగా ఉంటుంది. దీంతో చారు చేసుకుంటే చాలా తాజాగా, చాలా టేస్టీగా ఉంటుంది.



### పొడిలో ఆరోగ్యప్రయోజనాలు

ఈ చారు పొడిలో ముఖ్యమైన పదార్థాలు ధనియాలు, జీలకర్ర, కందిపప్పు. ఈ మూడింటి వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ధనియాలలో ఉండే ఔషధ గుణాల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అనేక చర్మ సమస్యలను తగ్గించడంలో ధనియాలు ముందుంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీనిలో యాంటీ హైపర్ గ్లైసిమిక్ లక్షణాలు ఎక్కువ. కాబట్టి మధుమేహ రోగులు కచ్చితంగా ధనియాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. చారు పొడిలో ఈ ధనియాలు ఎక్కువ శాతం ఉంటాయి కాబట్టి దీంతో ప్రతిరోజు రసం చేసుకుంటే మంచిది. జీలకర్రను కూడా ఇందులో వినియోగించాం, దానివల్ల గుండె సమస్యలు రాకుండా ఉంటాయి. బీపీ, షుగర్ అదుపులో ఉంచుతుంది. కొన్ని రకాల చర్మ సమస్యలు, అలెర్జీలను రాకుండా అడ్డుకుంటుంది. కందిపప్పు తినడం వల్ల ప్రోటీన్లు పుష్కలంగా అందుతాయి. ఈ పప్పుతో ఫైబర్, క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. జ్ఞాపకశక్తిని పెంచేందుకు కూడా ఇది ఔషధంలా పనిచేస్తుంది.



# నయనతార లేదా త్రిష.. కార్తీ కొత్త సినిమాలో హీరోయిన్ ఎవరు?

తమిళ స్టార్ హీరో కార్తీ, డైరెక్టర్ మోహన్ రాజా కాంబినేషన్‌లో తెరకెక్కనున్న కొత్త సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఇప్పుడు కోలీవుడ్‌లో తెగ హల్‌చల్ చేస్తుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మేకర్స్ ఇద్దరు స్టార్ హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్‌గా ముందుగా స్టార్ హీరోయిన్ నయనతారను తీసుకునేందుకు చిత్రబృందం ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. నయనతార డేట్స్ అందుబాటులో ఉంటే ఆమెనే ఫైనల్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. గతంలో కార్తీ, నయనతార కలిసి 'కాశ్మోరా' సినిమాలో నటించగా, వారి జోడీకి మంచి ఆదరణ లభించింది. అలాగే దర్శకుడు మోహన్ రాజా - నయనతార కాంబినేషన్‌లో 'తని ఒరువన్', 'వేలైక్కారన్', 'గాడ్‌ఫాదర్' వంటి చిత్రాలు తెరకెక్కాయి. దీంతో ఈ కాంబినేషన్ మరోసారి రిపీట్ అయ్యే అవకాశం ఉందన్న ప్రచారం అభిమానుల్లో ఆసక్తి పెంచుతోంది. అయితే ఒకవేళ నయనతార డేట్స్ అందుబాటులో లేకపోతే, స్టార్ హీరోయిన్ త్రిషను ఎంపిక చేసే అవకాశాలను కూడా మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలా జరిగితే 'పొన్నియిన్ సెల్వన్' తర్వాత కార్తీ - త్రిష జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ కాంబినేషన్‌పై కూడా అభిమానుల్లో మంచి క్రేజ్ ఉంది. అయితే హీరోయిన్ ఎంపికకు సంబంధించి ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన బయటికి రాలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వినిపిస్తున్న ఈ వార్తలు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి.



# పాట... ఫైటు...

పాండిచ్చేరిలో పాట, ఫైట్‌లతో హీరో రామ్ బిజీగా ఉన్నారు. రామ్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహిస్తున్న తొలి సినిమా 'ఆర్‌ఏపీవో23' (వర్కింగ్ టైటిల్). ఈ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ సినిమాను రా పో సినిమాటిక్స్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ పాండిచ్చేరిలో జరుగుతోంది. 15 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్, ఓ పాట చిత్రీకరణను ప్లాన్ చేశారు. 'కేజీఎఫ్: చాప్టర్ 1, కాంతార, కరుప్పు' చిత్రాల ఫేమ్ స్టంట్ కొరియోగ్రాఫర్ విక్రమ్ మోర్ యాక్షన్ సీకెన్స్‌లను డిజైన్ చేస్తుండగా పాటకు బృందా మాస్టర్ కొరియోగ్రఫీ వహిస్తున్నారు. ''కొత్త రకమైన క్యారెక్టరైజేషన్స్‌తో, కొత్త తరహా మేకింగ్‌తో రూపొందిస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.




# స్టార్ ప్రొడ్యూసర్స్ హీరోయిన్ ఆఫర్ ఇచ్చినా వద్దన్న యాంకర్ చర్మిల..

టాలీవుడ్ సినిమా ఈవెంట్లలో తన అద్భుతమైన హోస్టింగ్, స్పాంటేనిటీతో తక్కువ సమయంలోనే ప్రేక్షకుల మనసు దోచుకుంది చర్మిల నల్లూరి. ఈమె ప్రతిభను చూసి ఏకంగా స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, ప్రముఖ నిర్మాత కం దర్శకుడు ఎం.ఎస్. రాజు సైతం ఆమెను తమ సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తావా అంటూ ఆఫర్లు ప్రకటించారు. టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోయిన్గా మారాలని కలలు కంటుంటే, ఇలాంటి గోల్డెన్ ఆఫర్లు వస్తే ఎవరైనా వెంటనే ఒప్పుకుంటారు. కానీ చర్మిల మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచే నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఆమెతో NTV Web ప్రత్యేకంగా సంభాషించింది. ఈ క్రమంలో ఆమె కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. స్టార్ ప్రొడ్యూసర్లు స్వయంగా సినిమా అవకాశాలు ఇస్తామన్నప్పటికీ, తనకు నటనపై ఎలాంటి ఆసక్తి లేదని చర్మిల స్పష్టం చేశారు. అంతేకాకుండా తన తల్లిదండ్రులకు కూడా తాను నటించడం ఇష్టం లేదని, వారి మాటకు వ్యతిరేకంగా నటన వైపు అడుగులు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సినిమాల వైపు వెళ్లే ఆలోచన పూర్తిగా లేదని, కేవలం యాంరింగ్ రంగంలోనే మరింత పైస్థాయికి ఎదగడమే తన లక్ష్యమని ఆమె వెల్లడించారు. ఇండస్ట్రీ నుంచి, ప్రేక్షకుల నుంచి తనకు లభిస్తున్న అపారమైన ప్రేమపై చర్మిల భావోద్వేగంగా స్పందించారు. "ఎంతోమంది ఎంతో ప్రయత్నం చేసినా దొరకని అదృష్టం ఇది. ఆడియన్స్ నాపై చూపుతున్న అన్ కండిషనల్ లవ్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను" అని ఆమె తెలిపారు. ఎలాంటి సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేనప్పటికీ, అల్లు అరవింద్, ఎం.ఎస్. రాజు వంటి దిగ్గజాలు తనను ఎంతగానో ప్రోత్సహిస్తూ మాట్లాడటం వారి గొప్పతనానికి నిదర్శనమని చర్మిల కొనియాడారు. వెండితెరపై మెరిసే అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించి, యాంకరింగ్‌పైనే పూర్తిగా దృష్టి పెట్టిన ఈ టాలెంటెడ్ బ్యూటీ నిర్ణయం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.



# ఆ ఫొటోలను వెంటనే తొలగించండి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) వల్ల సినీ సెలబ్రిటీలకు... ముఖ్యంగా హీరోయిన్లకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు హీరోయిన్ల డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోలు సృష్టించి నెట్టింట పోస్ట్ చేస్తుండటంతో అవి క్షణాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఆ ఫొటోలు, వీడియోలు ఒరిజినల్ అని భ్రమపడేవారు లేక పోలేదు. అందుకే అవి డీప్ ఫేక్ ఫొటోలు అని సదరు స్టార్స్ క్లారిటీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే రష్మిక మందన్నా, ఆలియా భట్‌తో పాటు పలువురు నటీమణులు ఈ ఇబ్బందులు ఎదుర్కోగా తాజాగా హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ కూడా డీప్ ఫేక్ బారిన పడ్డారు.

ఇటీవల 'ఎక్స్'లోని ఒక పేజీలో ఆమె మార్ఫింగ్ ఫొటోలు వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. తాజాగా వీటిపై సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు మృణాళ్ ఠాకూర్. ''నా డీప్ ఫేక్ ఫొటోలను సృష్టించి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్ట విరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం కరెక్ట్ కాదు. వెంటనే వాటిని తొలగించండి... లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. అదే విధంగా ఈ ఫొటోలను ఇకపై షేర్ చేసినవారిపై కూడా చర్యలు తప్పవు'' అంటూ ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S